పైపులైన్ల లీకేజీలతో అవస్థలు

- పట్టణంలో ఏ కాలనీలో చూసినా లీకేజీలే
- భారీగా తాగునీటి వృథా.. కలుషితమవుతున్న శుద్ధినీరు
- అధికారుల చర్యలు అంతంతే...



ఒడ్డుగూడెం రోడ్డులో చెరువును తలపిస్తున్న పైపులైన్ లీకేజీ నీరు

పాల్వంచ: ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ అయిన పాల్వంచ పట్టణంలో పైపులైన్ల లీకేజీల కారణంగా తాగునీరు వృథా అవుతోంది. ఏ కాలనీలో చూసినా పైపులైన్లు లీకులు దర్శనమిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు మున్సిపాలిటీ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నా పాత పైపులైన్ల వల్ల సమస్యలు పునరావృతం అవుతున్నాయి. లీకేజీల కారణంగా శుద్ధినీరు కాస్తా కలుషితం అవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో 24 వార్డులు, సుమారు 80వేల జనాభా. ప్రధాన వీధుల్లో ఉన్న పైపులైన్లు ఇప్పటికే కాలం చెల్లినట్లు సమాచారం. దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్లు కావడంతో ప్రస్తుతం తరుచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి.

జలమయంగా మారుతున్న రోడ్లు..

పైపులైన్ల లీకేజీల కారణంగా రోడ్లు జలమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఒడ్డుగూడెం, టీచర్స్ కాలనీ, గొల్లగూడెం, బొల్లేరుగూడెం, గట్టాయిగూడెం, కరకవాగు, శివనగర్‌లలో సమస్య తీవ్రంగా ఉంది. నీటి సరఫరా అయ్యే సమయంలో లీకేజీ నీరంతా ఉబికి రోడ్లపైకి వచ్చి కాలువలా ప్రవహిస్తోంది. దీంతో రోడ్లు వరద నీటిని తలపిస్తున్నాయి. ఈ క్రమంలో స్థానికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల రోడ్లపై మడుగులుగా ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా రోడ్లపై గుంతలు పడి దెబ్బతింటున్నాయి. అనేక సంవత్సరాలు మన్నాల్సిన రోడ్లు పలుచోట్ల దెబ్బతింటున్నాయి. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒడ్డుగూడెం రోడ్డు లీకేజీల వల్లే దెబ్బతింటోందని స్థానికులు వాపోతున్నారు. అంతేగాక స్థానికుల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కలుషితం అవుతున్న తాగునీరు..

తాగునీటిని ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధి చేసి పంపిస్తున్నప్పటికీ లీకేజీల కారణంగా పైపుల్లోకి బురద నీరు చేరి కలుషితం అవుతున్నాయి. చేసేది లేక ఈ నీటినే స్థానికులు తాగి అనారోగ్యం పాలవుతున్నారు. లీకేజీలు అనేక చోట్ల ఏర్పడటంతో అధికారులను సైతం ఈ సమస్య వేధిస్తోంది. ఇప్పటికే కాలుష్య ఉద్గారాలు అధికంగా ఉన్న పాల్వంచ పట్టణంలో తాగునీటి సమస్య ఇబ్బంది పెడుతోంది. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నా మళ్లీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు ఈ తాగునీటి పైపులైన్ల లీకేజీలపై శాశ్వత పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బొల్లేరుగూడెంలో రోడ్డుపై పారుతున్న తాగునీరు

తాగునీరు వృథా..



పైపులైన్ల లీకేజీ వల్ల తాగునీటి వృథా అధికమవుతోంది. ఒడ్డుగూడెం, టీచర్స్ కాలనీ, బొల్లేరుగూడెం ఏరియాల్లో పలుచోట్ల లీకులు ఏర్పడి పంపులు వదిలిన ప్రతీసారి భారీ ఎత్తున నీళ్లు ఉబికి వచ్చి ఏరులై పారుతున్నాయి. నీటి వృథా వల్ల రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి.

– రత్నకుమార్, స్థానికుడు

మురుగు నీళ్లు వస్తున్నాయి...



పైపులైన్ల లీకేజీల వల్ల పైపుల్లో మురుగు చేరి కలుషితం అవుతున్నాయి. ఈ నీళ్లు తాగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. నిత్యం మురుగు నీటినే వాడుకోవాల్సి వస్తోంది. పట్టణంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కటుకూరి శేఖర్‌బాబు, స్థానికుడు

మరమ్మతులు చేపడుతున్నాం..



పైపులైన్ల లీకేజీలు ఏర్పడినట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే చర్యలు చేపడుతున్నాం. పాత లైన్లు కావడంతో తరచు లీకులు ఏర్పడుతున్నాయి. శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తాం. పట్టణంలోని అన్ని ఏరియాలకు తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

క్లుప్తంగా

శెట్టిబలిజ సంఘం కమిటీ ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం జిల్లా శెట్టిబలిజ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం రామవరంలోని ఎస్సీబీనగర్‌లోని జిల్లా శెట్టిబలిజ సంఘం కార్యాలయంలో కడలి లేడిబాబు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడిగా సప్పిడి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మొల్లేటి రాము, కోశాధికారిగా దొంగ వెంకటరమణ, గౌరవాధ్యక్షుడిగా గుత్తుల సాగర్ ఎన్నికయ్యారు. నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం బీసీ కులం నుంచి తొలగించిన శెట్టిబలిజ సంఘాన్ని తిరిగి కలపాలని కోరారు. సంఘం అభివృద్ధి కోసం పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాటి మోహన్‌రావు, సత్యనారాయణ, కుడిపుడి సత్యనారాయణ, నాగేశ్వరరావు, పితాని సత్యనారాయణ, దొమ్మేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయండి..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందు: గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు. రాసుద్దీన్, సామేల్, డి.ప్రసాద్, నరాటి వెంకన్న, మోహన్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవం

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి గుట్టపై సోమవారం నుంచి 27 వరకు జరగనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ధర్మపురం రాములు కోరారు. ఆదివారం కల్యాణ మహోత్సవం సందర్భంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యులు, బెల్లం వెంకటేశ్వరరావు, రామారావు, ఊకె భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, బండి నారాయణ, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేర్లు జంక్షన్లలో ప్రదర్శిస్తాం..

కొత్తగూడెంఅర్బన్: ఆస్తి పన్నులు చెల్లించని వారి పేర్లు పట్టణంలోని జంక్షన్లు, పబ్లిక్ ప్రదేశాలలో ప్రదర్శిస్తామని కొత్తగూడెం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నులు ఇప్పటి వరకు 60 శాతం వసూళ్లు చేయడం జరిగిందని, మిగిలిన వారు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మాజీ మంత్రి పరామర్శ



నివాళులర్పిస్తున్న సంభాని చంద్రశేఖర్

టేకులపల్లి: కోయగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ పూనెం రామచంద్రయ్య సతీమణి పూనెం పుల్లమ్మ గత నెల 27న మృతి చెందారు. ఆదివారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కోయగూడెం గ్రామంలో పూనెం పుల్లమ్మ ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యులు పూనెం సుధీర్, ముక్తేశ్వర్‌రావు, లవకుమార్, కళావతి, రజిత , కాలె ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆర్ఐ బదిలీ

పాల్వంచరూరల్: మండల రూరల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హచ్యా కొత్తగూడెం ఆర్‌డీఓ కార్యాలయానికి రెండు రోజుల క్రితం బదిలీ అయ్యారు. అయిన స్థానంలో ఆర్‌డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నళినీకుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తహసీల్దార్ వివేక్ ఆదివారం తెలిపారు.

చట్టాల రక్షణకు పోరాడుదాం..



సమావేశానికి హాజరైన తుడుందెబ్బ నాయకులు

ఇల్లెందు: ఏజెన్సీలో గిరిజనేతరులు చట్టాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా తమ ఆగడాలను కొనసాగిస్తున్నారని, అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని తుడుందెబ్బ ఆరోపించింది. ఆదివారం పెన్షనర్ భవన్‌లో తుడుందెబ్బ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసీ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ మాట్లాడుతూ... 1/70 చట్టం ఉన్నా హద్దు మీరుతున్నారని ఆరోపించారు. ఖాళీ స్థలాలు ఉంటే ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి గొగ్గెల రామస్వామి మాట్లాడుతూ... ఎల్‌టీఆర్ కేసులు ఉన్నా ప్రయోజనం లేదన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం మీద పోరాడేందుకు ఇల్లెందు నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఏప్రిల్ 20న చలో ఇల్లెందు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జార కృష్ణ, రాంప్రసాద్, తాటి రామారావు, పూనెం కోటయ్య, సీతారాములు, హనుమంతరావు, రాములమ్మ, రాధ, లక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

టేకులపల్లి: క్రీడలతోనే యువతకు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బోడు పోలీసుస్టేషన్ పక్కన మైదానంలో మొక్కంపాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ... స్నేహభావంతో క్రికెట్ ఆడి నైపుణ్యం పెంపొందించుకునే విధంగా పోటీలు ఉండాలని, క్షణికావేశాలు, మనస్పర్థలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ బానోత్ రవి, నిర్వాహకులు బి.రెబల్, సీహెచ్.ఆర్‌కె దొర, బి.ప్రశాంత్, బి.రవీందర్, బి.ప్రకాశ్, బానోత్ వాలు, మాలోత్ రాందాస్, బిజ్జ రామయ్య, ఈసం అంజయ్య, రామరావు, రాజబాబు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న సారంగపాణి

టేకులపల్లి: ఈనెల 25న హైదరాబాదులో జరగనున్న ఇఫ్టూ అనుబంధం రెండు హమాలీ యూనియన్ల విలీనసభను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లిలో హమాలీ ముఠా అడ్డా వద్ద బోడ మంచా అధ్యక్షతన కార్మికులతో నిర్వహించిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. హమాలీలు నిత్యం బరువులు మోయడం వలన మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 50సంవత్సరాల వయస్సు దాటిన హమాలీలకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, పక్కా గృహాలు, రేషన్ కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ నాగేశ్వరరావు, గుగ్గిళ్ల శంకర్, చంద్రు, లచ్చు, సురేందర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్యాగం, స్నేహానికి నిదర్శనం 'ఇఫ్తార్'



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని సింగరేణి స్కూల్ ఆవరణలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ... ఏటా రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలో ఉంటూ మానవాళికి మేలు జరగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారని వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయటం వారి త్యాగానికి, ఐక్యతకు చిహ్నమన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి లక్ష్మి, ముస్లిం పెద్దలు ఇబ్రహీం, ఇనాయతుల్లా రష్మి, హబీబ్, హనీఫ్, సిరాజ్, గౌస్, అఖిల్, కాంగ్రెస్ నేతలు సయ్యద్ జానీపాషా, ఇమామ్, సయ్యద్ ఆజమ్, మున్నీ, జాఫర్, బానోతు రాంబాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మండల రాము, పూనెం సురేందర్, కృష్ణప్రసాద్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, పెద్దినేని హరినాథ్ బాబు, తాటి భిక్షం తదితరులు హాజరయ్యారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి..

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టుల ఇంటి స్థలాల కోరిక న్యాయమైందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్‌రావు అన్నారు. గంగబిషన్ బస్తీలో జర్నలిస్టులు చేస్తున్న నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ కౌన్సిలర్లు వేముల ప్రసాద్, అంబుల వేణు, రుక్మాంగధర్‌బండారి, కొట్టి వెంకటేశ్వర్లు, అన్వర్ పాషా ఉన్నారు. జర్నలిస్టుల నిరసన శిబిరానికి తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు గుండపనేని సతీష్, సభ్యులు, షెడ్యూల్డ్ కులాల పోరాట సమితి అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ వచ్చి సంఘీభావం తెలిపారు.

సింగరేణిలో ప్రశాంతంగా రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఖాళీగా ఉన్న చార్జ్‌హ్యాండ్ (మెకానికల్) టీఅండ్‌ఎస్‌సీ గ్రేడ్ పోస్టులకు, వెల్డర్ ట్రైనీ క్యాటగిరి-1 పోస్టుల (అంతర్గత) రాతపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. చార్జ్ హ్యాండ్ (మెకానికల్)కు 56 మందికి 50 మంది పరీక్షకు హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. వెల్డర్ క్యాటగిరి-1 పోస్టులకు 32 మందికి 31 మంది హాజరయ్యారు. ఈ పరీక్షను జీఎం రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం నికోలస్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ... ఈ పరీక్ష ఫలితాలు ఈరోజు రాత్రి సింగరేణి ప్రధాన కార్యాలయంలోని నోటీస్ బోర్డ్‌లో, సింగరేణి వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలిపారు.

పోలీసుల అదుపులో వీఆర్‌ఏలు

జూలూరుపాడు: వీఆర్‌ఏలకు పే స్కేల్, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం పిలుపునిచ్చింది. ఈ క్రమంలో వీఆర్‌ఏలను ముందుస్తుగా ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులో తీసుకున్న వారిలో వీఆర్‌ఏలు రామారావు, ఎస్కే రియాజ్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులవి గొంతెమ్మ కోర్కెలు కాదు..



మాట్లాడుతున్న చందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న ఐదు డీఏలను, జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్‌సీలను అడగవద్దని, అవి కావాలంటే నెలనెలా జీతాలు ఇవ్వలేమని ప్రకటించడం సరైంది కాదని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.చందర్ అన్నారు. స్థానిక శేషగిరి భవన్‌లో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయంగా రావాల్సిన బకాయిలను, దాచుకున్న సొమ్మును చెల్లించాలని మాత్రమే అడుగుతున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ లాల్‌మహమ్మద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు మాత్రమే ఒకటవ తేదీన వేతనాలు ఇవ్వడం మినహా ఇతర సమస్యలు ఏమీ పరిష్కారం కాలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శంకర్, సుబ్బారావు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయండి..



మాట్లాడుతున్న ధర్మా

జూలూరుపాడు: స్థానిక ఉప మార్కెట్‌ను శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని గిరిజన, రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో గిరిజన, రైతు సంఘాల నాయకులు సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కింద జూలూరుపాడులో ఏర్పాటు చేసిన సబ్ మార్కెట్‌కు ప్రతీఏటా అధిక ఆదాయం వస్తోందన్నారు. జూలూరుపాడు మండలంతోపాటు, పాల్వంచ, చంద్రుగొండ, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, సుజాతనగర్, టేకులపల్లి, ఏన్కూర్ మండలాల రైతులు ఇక్కడకు పత్తి పంటను తీసుకొచ్చి అమ్ముతున్నట్లు చెప్పారు. అదేవిధంగా మార్కెట్‌లో వందలాది మంది హమాలీలు, నిరుద్యోగ యువత గుమస్తాలుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. మార్కెట్‌కు ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల్లో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. సబ్ మార్కెట్‌ను శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, లకావత్ నాగేశ్వరరావు, గుగులోత్ కేశవ్ నాయక్, బానోత్ మధు, భూక్యా రవి, శివ నాయక్, ఇరపా రాకేష్, బొర్రా ఉపేందర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు విసిగి పోయారు..



మాట్లాడుతున్న భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఇల్లెందు: అటు బీఆర్ఎస్ ఇటు కాంగ్రెస్ పాలన చూసిన తెలంగాణ ప్రజలు విసిగి పోయారని, ప్రజలంతా బీజేపీ పాలన కోసం ఎదురు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావటం ఖాయమని బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇల్లెందులోని ఓల్డ్ శుభోదయ స్కూల్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి అభినందన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదిగిందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ విముఖత వ్యక్తం చేస్తోందన్నారు. ఈ రెండు పార్టీల వైఖరి, కేంద్రంలోని మోదీ సర్కార్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ముందుకు సాగుతామన్నారు. నిన్న బీఆర్ఎస్‌లో ఉన్న లీడర్ నేడు కాంగ్రెస్‌లో రేపు అధికారంలో లేకపోతే మరో పార్టీలోకి వెళ్లే ఈ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. భద్రాచలంలో ఓ ఎమ్మెల్యే పార్టీ ఫిరాయించి నిరూపించాడని, సుప్రీంకోర్టు మొట్టికాయ వేస్తే పార్టీ మారలేదని బుకాయిస్తున్నారని ఆరోపించారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చినా వాటి మీద అటవీశాఖ అధికారుల ఆంక్షలు తొలిగిపోలేదన్నారు. ఈ సమావేశంలో కొల్లి సంజీవరెడ్డి, భూక్యా శ్రీను, విమల్‌కుమార్ జైన్, దోమల మహేశ్వర్, మిర్యాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుచిత్ర పాసీ, సునిత, శాసనాల రామయ్య, నాగరాజు, మండవ రాజు, శ్రీను, అశోక్, సందీప్, రాహుల్, పండు, విశాల్, జర్పుల రాంచందర్, పూన్యా నాయక్, డీకే శ్రీను, రతన్ ఖండేల్‌వాల్, రాజేశ్వరరావు, బాలకృష్ణ, కీర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆదివారం కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా సీఎంపీఎఫ్ కమిషనర్ కనకమ్మ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మల్లెల ఉషారాణి, పద్మజా కోటిరెడ్డి, ఫాతిమా రజాక్, అయేషా సుల్తానా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా పురుషులతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని, తాజాగా భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష క్రికెట్‌లో జిల్లా పేరు దేశం నలుమూలల ఇనుమడింపజేసిందని, ఇటీవల సింగరేణిలో ఎగ్జిక్యూటివ్ పోస్టులలో మహిళలు ఉద్యోగాలు పొందటమే కాకుండా, భూగర్భ గనుల్లో సైతం అధికారుల హోదాలో పనిచేయటం సంతోషం అన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు.

మాట తప్పిన మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న సత్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): రుణమాఫీ విషయంలో మాట తప్పిన మంత్రి తుమ్మల తక్షణం రాజీనామా చేయాలని తెలంగాణ రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల పైన రైతు రుణమాఫీ రద్దు సాధ్యం కాదని ప్రకటించటం తప్పు అని, అటువంటి మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేశారని 30శాతం మాత్రమే మాఫీ చేసినట్లు చెప్పారు. జిల్లాకు సీతారామ ప్రాజెక్ట్ పేరుతో స్థానిక రైతులను మరో మోసం చేయటానికి తుమ్మల నాగేశ్వరరావు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ఈ జిల్లాలో పుట్టి పెరిగి, జిల్లాకు ద్రోహం చేయడం తగదన్నారు. అదే జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లాలో 1,85,034 మంది అర్హులైన రైతులు ఉంటే 64,900 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రుణాల పేర్లతో మోసం చేస్తుందని భరోసా పేరుతో కొత్త మోసానికి తెరలేపిందని, వ్యవసాయ కూలీలకు కూలి భరోసా అని చెప్పి వారిని కూడా మోసం చేసిందని, మోసాలు కుట్రలు, కుతంత్రాలతో కాలం వెళ్లదీస్తున్నారు తప్ప రేవంత్‌రెడ్డి రైతాంగానికి చేసిందేమీ లేదన్నారు. ఎలమంచిలి వంశీకృష్ణ, కొక్కెర పార్టీ పుల్లయ్య, కున్సోత్ ధర్మ, దొడ్డ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తిరుపతిరావు, ఊకంటి రవికుమార్, శంకర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో...



పాల్వంచ: టీయూసీఐ ఆధ్వర్యంలో... నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందు: ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు

భగత్‌సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పలుచోట్ల నిర్వహించారు. ఆయన చిత్రపటాల వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరానికి భగత్‌సింగ్ స్ఫూర్తి చిహ్నమని ఆయన అనుచరులు రాజ్‌గురు, సుఖదేవ్ జీవితంలో అసాధారణమైన త్యాగనిరతితో ప్రాణాలర్పించారని కొనియాడారు. వారి పోరాటస్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించాలన్నారు. సామాజ్యవాదంపై రాజీ పడకుండా మతతత్వాన్ని, కులతత్వాన్ని వ్యతిరేకించి భూస్వాముల పాలనను తిరస్కరించి భారత సమాజానికి ప్రత్యామ్నాయమైన మార్క్సిజం పట్ల ధృడమైన విశ్వాసాన్ని కలిగిన మహా మేధావి భగత్‌సింగ్ అని కొనియాడారు. యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి రావాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్